క్లుప్తంగా

జీడి ప్రాసెసింగ్ యూనిట్ పరిశీలన



జీడి ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: పట్టణంలో గల జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్‌ను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ బుధవారం పరిశీలించారు. ప్రాసెసింగ్ చేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రాసెసింగ్ ను మంచి నాణ్యతతో చేపట్టాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు చక్కగా ఉండడం వల్ల మార్కెట్లో ఒక బ్రాండ్ క్రియేట్ అవుతుందని పేర్కొన్నారు. తద్వారా మార్కెటింగ్‌కు పెద్ద ఎత్తున అవకాశాలు లభిస్తాయని చెప్పారు. జీడి పరిశ్రమకు జిల్లా అనువుగా ఉంటుందని, జిల్లాలో పెద్ద ఎత్తున జీడి ఉత్పాదకత ఉండడం ఇందుకు సహకరిస్తుందన్నారు. సిబ్బంది ఎప్పటికప్పుడు మంచి నైపుణ్యాభివృద్ధిని సాధిస్తూ మార్కెట్‌కు దీటుగా ప్రాసెసింగ్ చేస్తూ ఆకర్షణగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు

సాలూరు రూరల్: మావోయిస్టులు నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా సాలూరు రూరల్ పోలీసులు మండలంలో ముమ్మరంగా బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. రూరల్ ఎస్సై నరసింహ మూర్తి ఆధర్వంలో ప్రధాన రహదారులతో పాటు రూరల్ ప్రాంతాలలో పోలీసులు రోడ్డు కల్వర్టులు తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి ఆగస్టు 3వరకు జరుగుతున్న మావోయిస్టుల వారోత్సవాల్లో భాగంగా ముందస్తుచర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రయాణాల్లో మహిళలు జాగ్రత్తలు పాటించాలి



పార్వతీపురం రైల్వే స్టేషన్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న అప్ హోల్డ్, పోలీస్ సిబ్బంది

పార్వతీపురం టౌన్: మహిళలు ప్రయాణాలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని అప్‌హోల్డ్ జిల్లా కోఆర్డినేటర్ బి.సత్యనారాయణ తెలిపారు. బుధవారం ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పార్వతీపురం రైల్వే స్టేషన్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైళ్లలో ప్రయాణించేటప్పుడు అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. ముఖ్యంగా మహిళలు అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మొద్దని సూచించారు. మహిళలను అక్రమ రవాణా చేసి అసాంఘిక కార్యక్రమాలకు ఉపయోగించే వారు ఎక్కువయ్యారని వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బి. విజయచంద్ర

సీతానగరం: ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చిందని ఎమ్మెల్యే బి.విజయచంద్ర అన్నారు. మండలంలోని గాదెలవలసలో కేజీబీవీ టైప్-4 వసతి గృహాన్ని బుధవారం సర్పంచ్ బి.అన్నపూర్ణమ్మతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలియజేశారు. ఈ మేరకు వసతి గృహాల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంఈఓ జి.సూరిదేముడు, హెచ్‌ఎం శంకరరావు ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పది ఆటోలపై కేసులు

పార్వతీపురం టౌన్: రహదారి భద్రత నియమాలను అతిక్రమించిన పది ఆటోలపై కేసు నమోదు చేసినట్లు జిల్లా రవాణాశాఖ అధికారి టి దుర్గాప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం పట్టణంలోని బెలగాం సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది ఆటోలపై కేసులు నమోదు చేసి మూడు ఆటోలను సీజ్ చేసినట్లు తెలిపారు. రూ.55,000 అపరాధ రుసుము విధించినట్లు చెప్పారు. స్కూల్ పిల్లలను రవాణా చేసే ఆటోలు, వాహనాల డ్రైవర్లు పరిమితికి మించి పిల్లలను రవాణా చేసినట్లయితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ వాహన పత్రాలు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి వేగంతో వెళ్లే ఆటోలు, వాహనాలను సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ఆటోవాలాలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంవీఐ బి.కాశీరాం, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బాబు పాలన అట్టర్ ఫ్లాప్

● మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



జిల్లా కేంద్రంలో బాబుష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పార్వతీపురం మండలం పెదమరికి గ్రామంలో ఇంటింటికీ వంచన కరపత్రాన్ని అందజేస్తున్న పార్టీ నాయకులు

పార్వతీపురం రూరల్:

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కాపీ కొట్టి, అదనంగా 'సూపర్ సిక్స్' హామీలు ఇచ్చి ప్రజలను టీడీపీ అధినేత చంద్రబాబు మోసం చేశారు. అబద్ధాల వాగ్దానాలు ఇచ్చి ప్రజలను వెన్నుపోటు పొడిచారు. త్వరలోనే చంద్రబాబుకు ప్రజలు బుద్ధిచెబుతారని ప్రజా పాలనలో చంద్రబాబు అట్టర్ ఫ్లాప్ అయ్యారని, పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో గల 14వ వార్డులో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలు అమలు కాకపోవడంపై ప్రజా వ్యతిరేకతపై జనసేన, బీజేపీ నేతలు నోరు మెదపకపోవడం



సీతానగరం: ప్రభుత్వ వ్యతిరేక విధానాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విచారకరమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌చైర్‌పర్సన కొండపల్లి రుక్మిణి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సర్విసెట్టి శ్రీనివాసరావు, బీసీ సెల్ అధ్యక్షుడు గొర్లి మాధవరావు, మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ షఫీ, షేక్ జలాల్, కోలా సుధ, కౌన్సిలర్‌లు చీకటి అనురాధ, సువ్వాడ లావణ్య, వై త్రినాథ, వి.నేతాజీ, పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు చందాన ఆనంద్, రాష్ట్ర జిల్లా, నియోజకవర్గ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు, పట్టణ కార్యకర్తలు, స్థానిక ప్రజలు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పెదమరికిలో..ఇంటింటికీ వంచన కార్యక్రమం

మండలంలోని పెదమరికి గ్రామంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామంలో గడపగడపకు వెళ్లి కూటమి వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, వైస్ ఎంపీపీ బి.రవికుమార్, మజ్జి శేఖర్, రాష్ట్ర అనుబంధ విభాగాల కార్యదర్శులు మడక విశ్వనాథం, బంకపల్లి వాసుదేవరావు, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు బలగ నాగేశ్వరరావు, రాగాల సోమశేఖర్, పెదమరికి స్థానిక సర్పంచ్ హిమరిక గంగ, బి.త్రినాథ, గవర రమేష్, తుమరాడ కోటేశ్వరరావు, తుమరాడ పకీరునాయుడు పార్టీ కార్యకర్తలు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

చంద్రబాబు హామీలు నీటి మూటలే

సీతానగరం: చంద్రబాబు నాయకత్వంలో ఇచ్చిన హామీలు నీటి మూటలేనని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బలగ శ్రీరాములునాయుడు అన్నారు. ఈ మేరకు బాబూ ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం కాశీపేటలో సర్పంచ్ తేలు ధనుంజయమ్మతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలతో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీరాములునాయుడు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్‌పేరుతో హామీలు ఇంతవరకూ అమలు కాలేదన్నారు.చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం చేసిన మోసాన్ని ప్రజలకు వివరించడానికే గ్రామాల్లో మండల, జిల్లా నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్నామన్నారు. ప్రజలు పలురకాల సమస్యలను ఎదుర్కొంటున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు అనిపించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా, మండలనాయకులు ఆర్వీ పార్థసారథి, బి.శంకరరావు ఎం. ప్రభాకర్, ధనుంజయ్, వై శివున్నాయుడు, వై.గోపాల్, పాస్టర్ రాము, వెంకట్, వేణు, ఎంపీటీసీలు సింహాచలం, వెంకటరమణ, సూర్యనారాయణ, కిరణ్‌కుమార్, సర్పంచ్‌లు శ్రీనివాసరావు, బి.తిరుపతిరావు, తేలు శ్రీనివాసరావు, బి.తిరుపతిరావు జగన్‌మోహన్ రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

మోసపూరిత ప్రభుత్వం

● వైఎస్సార్‌సీపీ నాయకుల మండిపాటు
● పణుకువలసలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం



పణుకువలసలో ప్రచారం చేస్తున్న నాయకులు

బలిజిపేట: కూటమి ప్రభుత్వం మోసపూరిత ప్రభుత్వమని, దానిని ప్రజలు గుర్తించాలని జెడ్పీటీసీ రవికుమార్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచనల మేరకు గ్రామ సర్పంచ్ విజయ ఆధ్వర్యంలో బలిజిపేట మండలంలోని పణుకువలసలో చంద్రబాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రవికుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అని ఆ తరువాత ప్రజలను మోసంగించిన కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని ప్రభుత్వ పనితీరును ప్రజలకు తెలియజేసి ప్రజల పక్షాన ఉండి పోరాడి ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలను అందించేందుకు వైఎస్సార్‌సీపీ నడుం బిగించిందన్నారు. ఎన్నికల తరుణం కాకపోయినా ప్రజల పక్షాన ఉండే నాయకుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పి.లత, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, ఎంపీపీ నాగమణి, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, మేధావుల సంఘం జిల్లా అధ్యక్షుడు పీఎస్ఆర్ నాయుడు, పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి టి.ప్రసాదరావు, పార్టీ జిల్లా ఆర్గనైజేషనల్ కార్యదర్శి కె.మోహనరావు, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు రణదేవ్ లక్ష్మణరావు, పార్టీ మండల రైతు విభాగం అధ్యక్షుడు జి.సత్యం నాయుడు, సర్పంచ్ సుందరరావు, ఎంపీటీసీ రాజమోహన్, పి.నారాయణరావు, సీహెచ్.జగ్గు నాయుడు, ఎ.మాధవనాయుడు, ఎం.శ్రీనివాసరావు, కె.వెంకటరమణ, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్వమిత్వ కార్యక్రమంలో శాశ్వత ఇంటి హక్కు



గ్రామీణ స్థాయి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

పార్వతీపురం రూరల్: గ్రామ రెవెన్యూ పరిధిలో గల ప్రతి ఇంటికి ప్రభుత్వం శాశ్వత ఇంటి హక్కు పత్రాల పంపిణీతో పాటు, ఇళ్లకు సంబంధించిన హద్దులు, ఇంటి విస్తరణ, పొడవు, వెడల్పులు నిర్ణయించి శాశ్వత హక్కును కల్పించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన స్వమిత్వ కార్యక్రమంపై పూర్తిస్థాయి అవగాహన ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు అన్నారు. ఈ మేరకు స్వమిత్వపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏడు మండలాల వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డీఏలకు బుధవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జి.రమేష్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీపీఓ కొండలరావు మాట్లాడుతూ మన్యం జిల్లాలో తొలి విడత కింద స్వమిత్వ పథకంలో 250 రెవెన్యూ గ్రామాలను ప్రభుత్వం గుర్తించిందని, అందుకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీపీఎస్ మ్యాప్ అనుగుణంగా గ్రామస్థాయిలో గల ఇళ్ల స్థితిగతులు, వాటి విస్తీర్ణ హద్దులు, శాశ్వత పత్రాలు తదితర వాటిపై సర్వే చేపట్టాలని సూచించారు. ఈ విధానం మూలంగా ఆ ఇంటి యజమానికి పూర్తి హక్కు శాశ్వత పత్రాలు ప్రభుత్వమే జారీ చేస్తుందని వివరించారు. పూర్వీకుల నుంచి అన్నదమ్ములకు వచ్చిన ఇంటి ఆస్తి కూడా గ్రామ తీర్మానంతో శాశ్వత పత్రాలు జారీ చేస్తారని వివరించారు. అవగాహన సదస్సులో డీఎల్‌పీఓతో పాటు ఏడు మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

డీఈఐసీ వైద్యులు, సిబ్బందితో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగన్మోహన్

పార్వతీపురం టౌన్: బాలలకు మెరుగైన ఆరోగ్య ఫలితాలు అందించడమే ధ్యేయంగా జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఉన్న డీఈఐసీని బుధవారం ఆయన సందర్శించి వైద్య బృందంతో సమీక్ష చేశారు. క్షేత్ర స్థాయిలో, ఆస్పత్రుల్లో గుర్తించిన పుట్టుక, ఎదుగుదల లోపాలు, వ్యాధులతో ఉన్న బాలల వివరాలు వారిలో శస్త్ర చికిత్స, థెరపీలతో లోపాలు సవరించిన, ఆరోగ్యం మెరుగు పడిన పిల్లల వివరాలు అడిగి తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. కేంద్రంలో వైద్య పరికరాలు, ఉపకరణాల పని తీరుపై తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ జగన్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న స్కూల్,అంగన్వాడీ స్క్రీనింగ్ లను వైద్య సిబ్బంది పారదర్శకంగా చేపట్టి పుట్టుక, ఎదుగుదల లోపాలు, వ్యాధులను సత్వరమే గుర్తించి డీఈఐసీ కేంద్రానికి చేర్చాలని, అందుకు ఆరోగ్యశాఖ ద్వారా ఉచితంగా ఏర్పాటు చేసిన ఆర్‌బీఎస్‌కే వాహనాన్ని సద్వినియోగం చేయాలని సూచించారు. సమీక్షలో పిల్లల వైద్య నిపుణుడు డా.ఎల్.భరత్ చంద్ర, డెంటల్ వైద్యులు డా.సౌజన్య, స్రవంతి, ఫిజియోథెరపిస్ట్ లక్ష్మీనారాయణ, సైకాలజిస్ట్ ఉదయ్ కుమార్, అంజమ్మ, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హైడ్రోపవర్ ప్రాజెక్టు రద్దుపై హర్షం



మాట్లాడుతున్న సీపీఎం నాయకురాలు సుబ్బారావమ్మ

పార్వతీపురం: మన్యం ప్రాంతంలో గిరిజనులకు నష్టం చేకూర్చే హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం ఒప్పందాలను రద్దు చేయడం హర్షణీయమని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో సీపీఎం నాయకులు కె.గంగునాయుడు, ఎస్‌వై.నాయుడు, కె.రామస్వామిలు నిర్వహించిన సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుబ్బారావమ్మ మాట్లాడుతూ హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని అదానీ సంస్థకు అప్పగించి గిరిజనులకు ద్రోహం చేసేందుకు ప్రభుత్వం పూనుకుందని, సీపీఎం ఎన్నో పోరాటాలు చేసి హైడ్రోపవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేసేలా వ్యవహరించిందన్నారు. దీని ఫలితంగా పాచిపెంట మండలం కారివలస, కురుకుట్టిలో అదానీ ప్రాజెక్టు నిర్మాణం రద్దుకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందన్నారు. అలాగే అనంతగిరి, అరకు, కరేడు ప్రాంతాలలో పవర్‌ప్రాజెక్టు నిర్మాణాలకు సేకరిస్తున్న భూములను తిరిగి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో గిరిజన సంపదకు నిలయాలైన కొండలను మైనింగ్ తవ్వకాలకు అనుమతులిస్తున్నారని, ఎన్నో ఏళ్లుగా సాగుచేసి పంటలు పండిస్తున్న భూములకు మాత్రం పట్టాలివ్వడంలేదని మండిపడ్డారు. గిరిజనుల హక్కులను కాపాడేందుకు సీపీఎం అలుపెరగని పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

నీడ్ ఆధ్వర్యంలో మానవ ఆక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం



మాట్లాడుతున్న నీడ్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ మోహనరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ

సాలూరు: పట్టణంలోని వైటీసీ వద్ద నీడ్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మానవ ఆక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నీడ్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ మోహనరావు మాట్లాడుతూ, బలవంతంగా లేదా మోసం చేసి మానవ అక్రమ రవాణా జరుగుతోందని, ఇది తీవ్రమైన మానవహక్కుల ఉల్లంఘన, ఆధునిక బానిసత్వమన్నారు. వైటీసీ మేనేజర్ విద్యాసాగర్ మాట్లాడుతూ, పేదరికం, ఉపాధి లేకపోవడం మానవ అక్రమ రవాణాకు కారణమన్నారు. కార్యక్రమంలో గర్భిణులు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి

పార్వతీపురం టౌన్: మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ పిలుపునిచ్చారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అప్‌హోల్డ్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలను ఆడపిల్లలను మాయమాటలు చెప్పి ఒక ప్రాంతం నుంచి ఇంకొక ప్రాంతానికి తరలించి వారిని అనేకమైన చట్ట విరుద్ధమైన కార్యక్రమాలలో నిర్బంధిస్తున్నారన్నారు. ఇటువంటి మానవ అక్రమ రవాణాను నిర్మూలించే దిశగా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు ఎస్.చిట్టి బాబు, డీసీపీఓ అల్లు సత్యనారాయణ, ఆర్‌పీఎఫ్ ఎస్సై ఎస్. వెంకట్రావు, ఎస్సై గోవింద్, ఉమెన్ సెల్ ఏఎస్సై టి.సరళ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు పీ-4 వేధింపులు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు

పార్వతీపురం టౌన్: దత్తత పేరుతో ఉద్యోగులకు పీ-4 వేధింపులు సరికాదని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు దత్తత ఇచ్చి వేధించి బంగారు కుటుంబాలను బాగు చేస్తామని ప్రభుత్వం అనుకోవడం సరికాదన్నారు. పేదలను ధనవంతులుగా చేసేందుకు అనేక మార్గాలు ఉన్నాయని ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన, పొందుతున్న సంపన్నులకు దత్తత ఇవ్వడం ద్వారా బంగారు కుటుంబాలను బాగు చేయవచ్చన్నారు. బంగారు కుటుంబాలు అధికంగా ఉండే ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపించడం ద్వారా వారికి ఉపాధి కల్పించి బాగు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బత్తిన మోహన్ రావు, , నియోజకవర్గం చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు తీళ్ల గౌరీ శంకరరావు, జిల్లా నాయకుడు పాలక రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీఓలు వచ్చేవరకు పోరాటం



మాట్లాడుతున్న నాయకులు

సాలూరు: మున్సిపల్ రంగంలో ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలకు సంబంధించిన జీఓలు వచ్చేవరకు పోరాటం కొనసాగుతుందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ పట్టణ నాయకులు తెలిపారు. నెల్లూరులో వర్క్ ఔట్ సోర్సింగ్‌ను వ్యతిరేకిస్తూ కార్మికులు పోరాడి విజయం సాధించినందుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలో నాయకులు రవి, రాముడు, స్వప్నలు మాట్లాడుతూ, మున్సిపల్ మినిస్టర్ నారాయణ సొంత జిల్లాలో పని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడాన్ని నిరసిస్తూ కార్మికవర్గం పెద్ద ఎత్తున సమ్మెకు దిగారన్నారు. దీంతో ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చిందని ఇది కార్మికుల విజయమని పేర్కొన్నారు.అలాగే మిగిలిన జీఓల కోసం రాష్ట్రంలో యూనియన్ పెద్ద ఎత్తున ఆందోళన చేస్తోందని తెలిపారు. గత 17 రోజుల సమ్మెకాలంలో చేసుకున్న అన్ని రకాల ఒప్పందాలతో జీఓలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్‌సీ వెంటనే వేసి కార్మికుల వేతనాలు పెంచాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటానికి కార్మిక వర్గం సిద్ధమవుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు పోలరాజు, ఈశ్వరరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన ఒకటి రెండిళ్లకే పరిమితం

● ముఖం చాటేస్తున్న మంత్రి సంధ్యారాణి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు రూరల్: కూటమి ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలనలో తొలిఅడుగు పేరుతో ఇంటింటికీ మంత్రులు, నాయకులు ప్రభుత్వ పరిపాలన, పథకాల అమలుపై అవగాహన కల్పించాలని నిర్వహిస్తున్న కార్యక్రమంలో సాలూరు మండలంలో గిరిజన శాఖమంత్రి సంధ్యారాణి ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొంటున్నారు. అయితే గ్రామాల్లో మంత్రి సంధ్యారాణి ఒకటో రెండో ఇళ్లకు వెళ్లి ఆ గ్రామంలో సమావేశానికే పరిమితమవుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. దీనికి కారణం కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో ఏడాది పాలనలో అమలు చేసిన దాఖలాలు లేకపోవడంతో ఎక్కడ తమకు ప్రజలనుంచి వ్యతిరేకత వస్తుందోనన్న భయంతోనే ఇంటింటికీ వెళ్లలేకపోతున్నారన్న ప్రచారం పెద్ద ఎత్తున జరుగుతోంది. గ్రామాల్లో రైతులు రైతుభరోసా ఎప్పుడిస్తారోని అడుగుతారేమోనని ఇంటిఇంటికి మంత్రి రావడం లేదని పలు గ్రామాల రైతులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. తెలుగుదేశం కార్యకర్తలు తమ పార్టీకి సంబంధించిన ఒకటి రెండిళ్లకు మంత్రిని తిప్పేసి సమావేశం ఏర్పాటు చేయడం ఆ సమావేశంలో అన్ని పథకాలు అమలు చేశాం. ఒక్క ఉచిత బస్సు ప్రయాణం తప్ప..తొందరలోనే ఉచిత బస్సు కూడా అమలు చేస్తామని మంత్రి చెప్పుకొస్తున్నారు.

పథకాలన్నీ ఎప్పుడిచ్చేశారో?

అయితే సమావేశంలో వెనుక ఉన్న కొంతమంది ప్రజలు మాత్రం రూ.వెయ్యి పెన్షన్ పెంచి ఇవ్వడంతో పాటు తల్లికి వందనం కొంతమందికి ఇచ్చి అన్ని పథకాలు ఇచ్చేశామని మంత్రి చెప్పడంతో అవాక్కవుతున్నారు. మహిళకు రూ.1500, రైతుభరోసా, నిరుద్యోగ భృతి, ఉచిత గ్యాస్ పథకాలు ఎప్పుడు ఇచ్చేశారో? మరి మనకు తెలియడం లేదని హాస్యాస్పదంగా మాట్లాడుకుంటున్నారు. సుపరిపాలన కార్యక్రమం సర్వసాధారణమైన విషయంగా మారిందన్న ప్రచారం జరుగుతోంది. బుధవారం మండలంలోని కొట్టుపరువు పంచాయతీలో సుపరిపాలన కార్యక్రమానికి హాజరైన మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులైన వారందరికీ అందించడమే చంద్రబానాయుడు ధ్యేయమన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి సంధ్యారాణి అసత్యప్రచారాలు మానుకోవాలి

● వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల డిమాండ్



మున్సిపల్ సర్వసభ్యసమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు, అధికారులు

సాలూరు: మంత్రి హోదాలో ఉన్న రాష్ట్ర స్త్రీ శిశు, గిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి అసత్యప్రచారాలు చేయడం సరికాదని, ఇకనైనా వాటిని మానుకోవాలని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు గిరిరఘు, గొర్లె వెంకటరమణ, బలభద్రుని శ్రీనివాసరావు,సింగారపు ఈశ్వరరావులు డిమాండ్‌చేశారు. ఈ మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్యసమావేశం వాడీవేడిగా జరిగింది. శ్యామలాంబ పండగకు ముందు మున్సిపాలిటీలో మంజూరైన సుమారు రూ.2 కోట్ల అప్పు డబ్బుతో ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు,మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపిందా? లేదా? అని కమిషనర్ ప్రసాద్‌ను కౌన్సిలర్ రఘు ప్రశ్నించారు. శ్యామలాంబ ఉత్సవ కమిటీ సమావేశంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌లు అభివృద్ధి పనులను అడ్డుకున్నారని మంత్రి మంగళవారం విమర్శించారని పేర్కొంటూ ఈ అంశంపై స్పష్టత ఇవ్వాలని కమిషనర్‌ను కోరారు.

వివిధ దశల్లో పనులు

దీనిపై కమిషనర్ మాట్లాడుతూ రూ.2 కోట్ల నిధులకు సంబంధించి ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందని, ఆ పనులు నేడు మున్సిపాలిటీలో జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఈ పనులు నేడు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మా వల్లనే అభివృద్ధి పనులు ఆగిపోయాయని మంత్రి పదేపదే తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. మంత్రిస్థాయిలో ఉన్న సంధ్యారాణి ఈ విధంగా అసత్యప్రచారాలను చేసి ఆమె స్థాయిని తగ్గించుకుంటున్నారని విమర్శించారు. వార్డుల్లో పలు అంశాలపై అధికారులను కౌన్సిలర్లు నిలదీశారు. అభివృద్ధి అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికులపై లాఠీచార్జి అన్యాయం



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురం టౌన్: నెల్లూరులో మునిసిపల్ కార్మికులపై పోలీసు లాఠీ చార్జి అన్యాయమని సీఐటీయూ జిల్లా కోశాధికారి అధికారి గొర్లి వెంకట రమణ మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్- ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న నెల్లూరు మున్సిపల్ కార్మికులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల్లో కార్మికులు చేస్తున్న పనిని ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించే ప్రయత్నం చేస్తోందని అందులో భాగంగా నెల్లూరు మున్సిపాలిటీలో ప్రైవేటీకరణ ప్రక్రియ ప్రారంభించారని దీనికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులపై లాఠీ చార్జికి దిగడం సరైన నిర్ణయం కాదన్నారు. ఇకనైనా నిర్బంధ చర్యలు మానుకుని కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బి.సూరిబాబు, మున్సిపల్ యూనియన్ నాయకులు నాగవంశం శంకరరావు, మామిడి శివ, బంగారు రవి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.